క్లుప్తంగా

రేపు దుకాణాలు, కొబ్బరి చిప్పల వేలం పాటలు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తులు సమర్పించే వస్త్రాలు, కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణతో పాటు తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారాలు నిర్వహించేందుకు శుక్రవారం వేలం పాటలు నిర్వహించనున్నట్టు ఈఓ తిమ్మారెడ్డి, చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన వారు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల లోపు ఆలయం వద్దకు హాజరుకావాలని కోరారు.

ఎమ్మార్పీకే ఎరువులు ఇవ్వాలి


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో

భాకరాపేట : డీలర్లు ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, రైతులకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారి ఖాదర్‌బాషా తెలిపారు. ఆయన బుధవారం ఎర్రావారిపాళెం మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువు బస్తాల తూకాలను పరిశీలించారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాలు కొనుగోలు చేస్తే విధిగా రసీదు తీసుకోవాలని రైతులకు సూచించారు.

మనోహరి ఆసుపత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని మనోహరి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్) గుర్తింపు లభించింది. ఈ మేరకు ఆసుపత్రి అధినేత డాక్టర్ రామచంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. తమ ఆసుప్రతిలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. డాక్టర్ హర్ష ద్వారా అడ్వాన్సుడు యూరాలజీ సర్వీసెస్, లాప్రోస్కోపి, లేజర్ సర్వీసెస్, అడ్వాన్సుడు టెస్ట్ ట్యూబ్ బేబీ సేవలను అత్యుత్తమంగా అందిస్తున్నామని వెల్లడించారు. తమ ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందని తెలిపారు.

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన


మారసానివారిపల్లె వద్ద గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న డీఈ శంకరయ్య

భాకరాపేట : అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పని సరిగా ఉండాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ డీఈ శంకరయ్య తెలిపారు. ఆయన బుధవారం మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లె గ్రావెల్ రోడ్డును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేపడితే పది కాలాల పాటు ప్రజలు పని గురించి చర్చించుకుంటారన్నారు. కార్యక్రమంలో క్యూసీ ఏఈ నవనీతమ్మ, పంచాయతీ రాజ్ ఏఈ రాజాజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇంద్ర, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్: బాలుడి కిడ్నాప్ కేసులో తిరుపతి రూరల్ మండలం అవిలాలకు చెందిన పి.సుధాకర్‌కు ఈ నెల 18వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద చెన్నైకి చెందిన ఆర్.చంద్రశేఖర్ కుమారుడు మురుగన్(2) కిడ్నాప్‌నకు గురయ్యాడు. ఈస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు సుధాకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులు పుష్కల్, సంజనతో హెచ్ఎం

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమణయ్య, పీడీలు కిషోర్ కుమార్, మస్తాన్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు పుష్కల్, సంజనను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 2వ తేదీ గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీల్లో పుష్కల్, సంజన తృతీయ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందని తెలిపారు.

పాఠశాలల తనిఖీ

నారాయణవనం: జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని, ఈశ్వరయానాది కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ప్రభాకర్‌రెడ్డికి అభివృద్ధి పనులపై కార్యాలయ ఏఓ గుణశేఖర్ వివరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం అరణ్యంకండ్రిగ పంచాయతీ ఈశ్వరయానాది కాలనీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధాన్ని రాబట్టారు. జగనన్న గోరుముద్ద అమలుపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. నాడు-నేడు పనుల ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు.

సప్తగిరినగర్‌లో పారిశుద్ధ్యానికి పెద్ద పీట

- రూ.1.65 కోట్లతో పెద్దకాలువ నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు

తిరుపతి మంగళం : మంగళం సప్తగిరినగర్ పంచాయతీ సప్తగిరికాలనీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో పారిశుద్ధ్యం మెరుగు పడింది. రూ.1.65 కోట్లతో పెద్ద కాలువ నిర్మాణం చేపట్టడంతో 30 ఏళ్ల నాటి ప్రజల కళ నెరవేరింది. సప్తగిరి నగర్ పంచాయతీలోని ప్రధాన మార్గంలో పెద్ద ఒరవకాలువ ఉండేది. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీటితో కలిసి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరేది. దీనికితోడు దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు నానాఅవస్థలు పడేవారు. ఈ సమస్యలను ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి తోపాటు స్థానిక ప్రజలు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు రూ.1.65 కోట్లు మంజూరు చేశారు.

రూ.1.65కోట్లతో పెద్ద కాలువ నిర్మాణం

గత 30 ఏళ్లగా సప్తగికాలనీ వాసులు పడుతున్న సమస్యకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చెక్ పెట్టారు. పెద్ద కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం తుడా నుంచి రూ.1.10 లక్షలు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నుంచి రూ.20 లక్షలు, మండల గ్రాంట్ నుంచి రూ.35 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలువ నిర్మాణం శరవేగంగా చేపట్టారు. పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని స్థానికులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అడిగిన వెంటనే స్పందిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో అత్యంత మెజారిటీతో గెలిపించుకుంటామని చెబుతున్నారు.


సప్తగిరినగర్ పంచాయతీలో రూ.1.65 కోట్లతో నిర్మిస్తున్న పెద్దకాలువ


నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు


సప్తగిరినగర్ పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం

20 ఏళ్లలో ఎన్నడూ జరగనంతగా అభివృద్ధి



గత 20 ఏళ్లలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి నాలుగేళ్లలో చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి దక్కుతుంది. సప్తగిరినగర్ పంచాయతీలో ఇప్పటికే సుమారు రూ.7 కోట్లతో సీసీ రోడ్లు, నూతన సచివాలయం, మురుగు కాలువలు, కమ్యూనిటీ భవనం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి, సంతోషం ఎందులోనూ దొరకదన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి స్ఫూర్తితో ముందుకు నడుస్తున్నాం.

– అశోక్‌రెడ్డి, సప్తగిరినగర్ పంచాయతీ ఉపసర్పంచ్

ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభం


ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, డీసీఎంఎస్ చైర్మన్

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లెలో ఏర్పాటుచేసిన చట్టేవారిపాళెం డివిజన్ స్థాయి ఎమ్మెల్యే కార్యాలయాన్ని బుధవారం చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు చేరువుగా ఉండేందుకే మండలంలో చిన్నగొట్టిగల్లు, యడమవారిపల్లె, భాకరాపేట కేంద్రాలుగా ఎమ్మెల్యే కార్యాలయాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఈ కార్యాలయాల ద్వారా ఎమ్మెల్యేకు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ఖదీర్‌అహ్మద్, సర్పంచులు మాధవి, శంకర్‌రెడ్డి, బాబీ, జెడ్పీటీసీ స్వరూప, బెంగళూరు భూషణ, మునిరాము, మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిటీ చైర్మన్‌కు ఉద్యోగుల వినతి



తిరుపతి కల్చరల్: తిరుపతి పర్యటనలో భాగంగా పద్మావతి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర శాసనసభ బీసీ కమిటీ చైర్మన్ రమేష్‌యాదవ్‌ను బుధవారం బీసీ ఉద్యోగులు కలిశారు. తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. బీసీ సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్, నాయకులు శ్రీనివాసులు, ఇ.తులసిరామ్, టి.గోపాల్, వీరకిరణ్, మునికేశవులు, గిరి, శ్రీనివాస్, కల్యాణ కట్ట అధ్యక్షుడు కె.వెంకటసుబ్బయ్య, శివ, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ పాల్గొన్నారు.

టౌన్ బ్యాంకు అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి

- మొండి బకాయిలు రూ.27,69,60,170ల వసూలు
- బ్యాంకు ఎన్‌పీఏ గ్రాస్ 23.03 నుంచి 8.88కి తగ్గింపు
- నవంబర్ 8న రుణగ్రస్తుల ఇళ్ల వేలం
- టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి వెల్లడి

తిరుపతి కల్చరల్: టౌన్ బ్యాంకు అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ పాలక మండలి 2022 జూలై 22న బాధ్యతలు చేపట్టిందని తెలిపారు. నాటి నుంచి నిబంధనల మేరకు పనిచేస్తూ ప్రలోభాలకు తలొగ్గకుండా మొండి బకాయిల వసూలు కు కృషి చేశామన్నారు. ఎన్‌పీ ద్వారా బ్యాంకు ఆర్థిక స్థితిగతులను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసు కున్నామన్నారు. తాము బాధ్యతలు చేపట్టే నాటికి సుమారు రూ.47 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. 14 నెలల్లోనే రూ.27,69,60,170 వసూలు చేశామని తెలిపారు. రుణాలు చెల్లించని సుమారు 189 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వారిలో 69 మంది బకాయిలు చెల్లించారని తెలిపారు. మిగిలిన వారు స్పందించకపోవడం, గడువు పూర్తి కావడంతో పొజీషన్ నోటీసులు ఇచ్చామన్నారు. తమ పాలక మండలి నిరంతర శ్రమతో ఎన్‌పీఏ గ్రాస్ 23.3, నెట్ ఎన్‌పీఏ -16.21గానున్న దాన్ని క్రమంగా తగ్గించుకుంటూ ప్రస్తుతం బ్యాంకు ఎన్‌పీఏ -8.88, నెట్ ఎన్‌పీఏను జీరో శాతానికి తీసుకువచ్చామని వెల్లడించారు. గరుడాద్రి నగర్, గాంధీరోడ్డు, పెద్దకాపు లేట్, ఆకుతోట వీధి, కస్తూరిబా యి సందులో ఉన్న మొండి బకాయిలున్న ఐదుగురు రుణగ్రస్తుల ఇళ్లను నవంబర్ 8న వేలం వేయనున్నట్టు తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు 10 శాతం సొమ్ము డిపాజిట్ చేయాలని సూచించారు. 2024 మార్చిలోగా డివిడెంట్లు కూడా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్యాంకు నుంచి ఇచ్చే మార్టిగేజ్ రుణాలను రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచడంతో పాటు డ్వాక్రా మహిళలకు రుణాల ప్రక్రియను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, డైరెక్టర్లు నాగిరెడ్డి, అనిల్, కాశీం, అమరనాథ్‌రెడ్డి, మాకం చంద్ర, తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రొఫెషనల్ డైరెక్టర్ దొరబాబు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి కల్చరల్: తిరుమల పాపవినాశంలో వ్యాపారస్తులపై దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పాపవినాశం లైసెన్స్ వ్యాపారుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, డబ్ల్యూస్.బాబు, ప్రకాష్, ప్రభ ఒక ప్రకటనలో కోరారు. తిరుమలలో పుట్టి పెరిగిన 37 మంది శ్రీవారిని నమ్ముకుని తిరుమల అటవీ ప్రాంతమైన పాపవినాశనంలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్నట్టు తెలిపారు. అటవీశాఖ అధికారులు తమకు జీవనోపాధి కోసం గత ఆగస్టు 14న లైసెన్సులు మంజూరు చేశారని పేర్కొన్నారు. కొంత కాలం క్రితం డ్యామ్ పనుల కోసం వచ్చిన రాధాకృష్ణ అనే వ్యక్తి కొంతమంది బయటివారితో పరిచయాలు పెంచుకుని ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా తమిళనాడులోని బాణావరం, కంచి, చెన్నై నుంచి సుమారు 200 మంది షికారీలను తీసుకొచ్చి కొత్తగా వ్యాపారాలు చేయిస్తున్నాడని ఆరోపించారు. వారి నుంచి రోజుకు రూ.300లు చొప్పున వసూలు చేస్తూ దందాలు చేస్తున్నాడని వాపోయారు. తాము అడిగితే మిమ్మల్ని కొట్టి డ్యామ్‌లో తోసేస్తానని బెదిరిస్తున్నాడని తెలిపారు. ఈవిషయమై సంబంధిత అధికారులు స్పందించి దౌర్జన్యం చేసే వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏరియా ఆస్పత్రిలో అన్నప్రసాదం ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున రోగులు, వారి కుటుంబ సభ్యులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆస్పత్రిలో రోగులు, వారికి సహాయంగా వచ్చే వారు ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజూ సుమారు 100 మందికి అన్నప్రసాదం వితరణ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

కొత్త ఓటర్లను చేర్చండి


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కొత్త ఓటర్లను చేర్చాలని తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఆయన బుధవారం రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పించే దిశగా పనిచేయాలని వెల్లడించారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఆర్ఐలు రామచంద్ర, జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి పద్మనాభరెడ్డి మృతి తీరనిలోటు


నేదురుమల్లి పద్మనాభరెడ్డి (ఫైల్)

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి సోదరుడు నేదురుమల్లి పద్మనాభరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ గురుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి పద్మనాభరెడ్డి చేసిన కృషిని గుర్తు చేశారు. స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన ఎంపీ గురుమూర్తి ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

రోడ్లు, మురుగుకాలువ పనులు పూర్తి చేయాలి


కేశవాయనిగుంటలో పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం : తిరుపతి నగరంలోని కేశవాయనిగుంట, ఎస్టీవీనగర్‌లోని చేపట్టిన రోడ్లు, మురుగు కాలువ నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం పనులను పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహానికి విరాళం


సుబ్రమణ్యస్వామి విగ్రహానికి విరాళాన్ని అందజేసిన బలిజ కాపు సమాఖ్య నాయకులు

పాకాల : ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో చేపట్టిన 54 అడుగుల విగ్రహ నిర్మాణానికి బుధవారం పాకాల మండల బలిజ కాపు సమాఖ్య సంఘం సభ్యులు రూ.54,116 విరాళం ఇచ్చారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఆలయ మర్యాదలతో దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దాతలు ఐ.రెడ్డెయ్య, ఓ.సుబ్రమణ్యం, వెంకటేష్, రమేష్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎన్ 150 పల్సర్ వాహనం ఆవిష్కరణ


ఎన్ 150 పల్సర్ ద్విచక్ర వాహనాన్ని ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ కులశేఖర్

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎంజీబీ బజాజ్ షోరూంలో సరికొత్త ఎన్150 పల్సర్ ద్విచక్రవాహనాన్ని బుధవారం ఏఎస్పీ కులశేఖర్, సీఐ చిరంజీవి విడుదల చేశారు. ఏఎస్పీ కులశేఖర్ మాట్లాడుతూ స్టైల్‌తోపాటు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏబీఎస్, వెడల్పాటి టైర్లు, ఎల్ఈడీ ప్రొజెక్టర్, హెడ్ ల్యాంప్‌తో వాహనాన్ని రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో షోరూం జీఎం శ్రీనివాస్, బజాజ్ ఆటో ఏఎస్ఎం అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపలోనూ ఆదరణ


గ్రామస్తులకు పథకాల గురించి వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం రాయలచెరువుపేట, బాదూరుపేట గ్రామాల్లో గడప గడపకు మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, మండల ఇన్‌చార్జి గణపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, సర్పంచి మురగయ్య, ఎంపీటీసీ కృష్ణవేణి, డివిజన్ అధ్యక్షుడు చిట్టిబాబు, పంచాయతీ కన్వీనర్ దొరస్వామి, నాయకులు మధు, వెంకటముని, యశ్వంత్, మురళి, పుష్పకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు


ప్లానింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిలో స్థలాలు ఇచ్చి గిఫ్ట్ డీడ్‌లు తీసుకున్న యజమానులకు టీడీఆర్ బాండ్లను త్వరితగతిన అందజేయనున్నట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అదే విధంగా అంతర్గత రోడ్ల విస్తరణ పనులు విస్తృతంగా చేపట్టినట్టు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో భూములను ఇస్తున్న యజమానుల నుంచి గిఫ్ట్ డీడ్లు తీసుకుని పక్కాగా టీడీఆర్ బాండ్లను అందజేయనున్నట్టు చెప్పారు. టీడీఆర్ బాండ్లు అందించే క్రమంలో ఎక్కడా చిన్నపాటి లోపాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో ఇకపై ఎక్కడా ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించేలని సూచించారు. అక్రమ, అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలను ఆదిలోనే గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

థ్రిల్లర్ యాక్షన్, ప్రేమ కథా చిత్రం స్పార్క్



మాట్లాడుతున్న స్పార్క్ చిత్రం హీరో విక్రాంత్, హాజరైన హీరోయిన్ మెహరిన్

తిరుపతి కల్చరల్: పాన్ ఇండియా స్థాయిలో థ్రిల్లర్, యాక్షన్, ప్రేమ సమ్మేళనంతో రూపొందించిన స్పార్క్ చిత్రం ఒక కొత్త బెంచ్ మార్క్‌గా నిలిచి ప్రేక్షకులను ఆకట్టుందని హీరో విక్రాంత్ తెలిపారు. ఈ చిత్రం నవంబర్ 17వ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సభ్యులు తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చారు. వారు బుధవారం తిరుపతిలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో చిత్రంలోని రెండో పాటను, ట్రైలర్‌ను విడుదల చేశారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకుడు, హీరో విక్రాంత్ మాట్లాడుతూ సినిమా అంటే తనకెంతో ఇష్టం కావడంతో ప్రత్యేక శిక్షణ పొందానన్నారు. యూఎస్‌లో జరిగిన కొన్ని యథార్థ సంఘటనలు ఆధారంగా కొంత కల్పితంతో ఈ చిత్రాన్ని రూపొందించినట్టు తెలిపారు. కుటుంబ సమేతంగా అందరూ చూసి ఆనందించేలా థ్రిల్లింగ్, ప్రేమ, యాక్షన్‌తో పాటు హాస్యం ఉన్నాయని తెలిపారు. నవంబర్ 17న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదలవుతోందని, ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. హీరోయిన్ మెహరిన్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి అద్భుతమైన రీతిలో రూపొందించిన చిత్రం స్పార్క్ అని, ఈ చిత్రం అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటుందన్నారు.

ఏ1 సర్వీసెస్‌పై చర్యలు తీసుకోండి


రుయా సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను నిలువునా మోసం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ ఏ1 సర్వీసెస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కార్మికులతో కలిసి రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం శానిటేషన్ సిబ్బందికి నెలకు రూ.16 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ సంస్థ రూ.11 వేల నుంచి రూ.12 వేలు ఇస్తూ కార్మికులను మోసం చేస్తోందన్నారు. 120 మంది కార్మికులతో నెట్టుకొస్తూ 200 మంది పనులు చేస్తున్నట్టు చూపుతూ ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నారని, దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా మెరుగ్గా ఉందంటూ రోజువారి ధ్రువీకరిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనల మేరకు 200 మందితో పనులు చేయించాలని, రూ.16 వేల వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఐదు రోజుల్లో వారికి నోటీసులు ఇచ్చి కార్మికులకు న్యాయం చేస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాకృష్ణ, ఎస్ శ్రీరాములు, పద్మనాభరెడ్డి, మునీశ్వర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూలి రూ.272 వచ్చేలా పనులు


ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని అంజిమేడు పంచాయతీలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. కూలీల మస్టర్లు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నీటి గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. గ్రామాల్లో పనులు కల్పించడం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయన్నారు. ప్రతి రోజు కూలి రూ.272 వచ్చేలా కొలతలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో పేదలకు పనులు కల్పించడంలో తిరుపతి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. గ్రామాల్లో విరివిరిగా కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు ఉన్నారు.